ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

కొందుర్గు, ఫిబ్రవరి 13: ప్రజా సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు మండలంలో గురువారం సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే రూ.1.47కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు రుణమాఫీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డు వంటి పథకాలు దిగ్విజయంగా అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, నరేందర్, మల్లేశ్‌గౌడ్, అంజిరెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఫరూఖ్‌నగర్ మండలంలోని కడియాలకుంట తండాలోని సంతుసేవాలాల్ ఆలయాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం సంతుసేవాలాల్ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, మాజీ పురపాలక వైస్ చైర్మన్ నటరాజన్, నాయకులు వీరేశంగుప్తా, హరిగౌడ్, శంకర్, రెడ్యా నాయక్ పాల్గొన్నారు.

- షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 13

లేనిది ఉన్నట్టు.. ఆన్‌లైన్ కనికట్టు

రేషన్ కార్డు దరఖాస్తుల్లో గందరగోళం

ఆన్‌లైన్‌లో తిరస్కరణకు గురవుతున్న అప్లికేషన్లు

70 శాతం మందికి కార్డు ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో చూపిస్తున్న వైనం

అయోమయానికి గురవుతున్న అర్జీదారులు

14 నెలల నుంచి దరఖాస్తులకే పరిమితం

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): రేషన్ కార్డు దరఖాస్తుదారులకు మీసేవలో చుక్కెదురవుతున్నది. ప్రజాపాలన, వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోనివారు మీసేవలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో మీసేవ కేంద్రాలకు అర్జీదారులు బారులు తీరుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో వందకు 70 శాతం మందికి ఇప్పటికే రేషన్ కార్డు ఉన్నట్లు సూచిస్తుండటంతో కంగు తింటున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న చాలామందికి 'అలాటెడ్' అని సూచిస్తుండగా మరి కొంతమందికి 'డూప్లికేట్' అని వస్తుందని వారు వాపోతున్నారు. తమకు రేషన్ కార్డు లేకున్నా ఉన్నట్లు ఎలా వస్తుందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాటెడ్ అని సూచిస్తున్న వారిని రేషన్ దుకాణాలు, పౌర సరఫరాల శాఖ కార్యాలయాలకు వెళ్లి అడగాలని మీసేవ నిర్వాహకులు చెబుతున్నారని అంటున్నారు. ప్రభుత్వం సూచించినట్లుగానే దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందని నిరసన వ్యక్తం చేస్తున్నారు.

కార్డు జారీ చేస్తారా?

ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల నుంచి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు దరఖాస్తులు తీసుకోవడమే కానీ సరైన మార్గదర్శకాలు జారీ చేసి అర్హులను గుర్తించిన దాఖలాలు లేవు. ప్రభుత్వం మీద నమ్మకం లేకపోవడంతో ఒక్కొక్కరు రెండు మూడు సార్లు దరఖాస్తు చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిపెట్టి తమకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

ఇంటి యజమానిగా పురుషులకు అనర్హత

ఇప్పటిదాకా రేషన్ కార్డులు మహిళల పేరుతోనే జారీ చేశారు. తాజా దరఖాస్తు చేసుకునే వాళ్లు కూడా ఇంటి యజమానిగా మహిళలనే సూచించాలని అధికారులు చెబుతున్నారు. కానీ ఒంటరిగా ఉండే పురుషులు, భార్య చనిపోయిన వారు తమ పేరుతో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. కానీ మీ సేవ కేంద్రాల్లో పురుషుల పేరుతో దరఖాస్తు చేస్తే ఆన్‌లైన్‌లో అంగీకరించడం లేదని చెబుతున్నారు. ఇంటి యజమానిగా మహిళ పేరు నమోదు చేస్తేనే దరఖాస్తు తీసుకుంటుందని అంటున్నారు. దీంతో ఒంటరిగా ఉండే వారు, భార్య చనిపోయిన వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమ పేరును మహిళగా నమోదు చేయాలని మీసేవ కేంద్రాల నిర్వాహకులను వేడుకుంటున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వమేమో పురుషుల పేరిట కూడా రేషన్ కార్డు తీసుకోవచ్చని చెబుతున్నా ఆన్‌లైన్‌లో మాత్రం స్వీకరించకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారు.

ఒక్కో కార్డుకు 2వేలిస్తే...

కొత్త రేషన్ కార్డులు ఇప్పటిస్తామంటూ దళారులు దరఖాస్తుదారులకు వల వేస్తున్నారు. ఒక్కొక్క అర్జీదారుడి నుంచి రూ.2 వేల దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. తాము దరఖాస్తు చేస్తే రేషన్ కార్డు రావడం ఖాయమని భరోసా కల్పిస్తూ దండుకుంటున్నట్లు తెలుస్తున్నది. మీసేవ నిర్వాహకులు రూ.50 కంటే ఎక్కువ తీసుకోవద్దని, అంతకంటే ఎక్కువ తీసుకుంటే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. గంటల తరబడి వేచి ఉండటం ఎందుకని భావించిన వారు దళారులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇదే అదనుగా భావించి అమాయక ప్రజల నుంచి వేలల్లో దండుకుంటున్నట్లు తెలుస్తున్నది.



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న తండావాసులు

ఆలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 13: ఫరూఖ్‌నగర్ మండలంలోని కడియాలకుంట తండాలో సంతుసేవాలాల్ ఆలయంలో గురువారం చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఈ ఆలయ నిర్మాణానికి రూ.2,22000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా తండా వాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మౌనిక హరికృష్ణ, దీనశంకర్, రెడ్యానాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్, సేవ్యా, మెహన్, రామచందర్, నరేందర్, శ్రీను, నాయకుల పాల్గొన్నారు.

కేజీబీవీకి బోరుమోటార్ అందజేత

బోరుమోటార్‌ను అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కొందుర్గు : కొందుర్గులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి బోరుమోటార్, పైపును అందజేశారు. ఆయన వెంట కొందుర్గు మాజీ జెడ్పీటీసీ తనయుడు రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రయ్య, రవీందర్‌రెడ్డి, విజయ్, భూపాల్‌గౌడ్, ప్రశాంత్, రవి, సందీప్, పెరుమాల్‌రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి

రైతుల పేర్లు తొలగించాలి

యాచారం, ఫిబ్రవరి13: ఫార్మాసిటీ బాధిత రైతుల భూములను నిషేధిత జాబితానుంచి తొలగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. మండలంలోని మాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీకి ఇవ్వని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, ఆన్‌లైన్‌లో టీఎస్ఐఐసీ పేరు తొలగించి రైతుల పేర్లను నమోదు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు తమ భూములను అమ్మకోవడానికి వీలుగా తమ భూములు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం బలవంతపు భూ సేకరణ ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. అదనపు పరిహారంగా కేటాయించిన ప్లాట్లను వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఫార్మాసిటీ గ్రామాలనైన మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు జగన్, జంగయ్య, బుగ్గరాములు, బ్రహ్మయ్య, చందూనాయక్, జంగయ్య, వెంకటయ్య, జగన్, విప్లవ్‌కుమార్, కార్యకర్తలు, తదితరులున్నారు.

ప్లాట్ల విక్రయదారులపై

చర్యలు తీసుకోవాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 13 : పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ తట్టిఅన్నారం సర్వేనం 127/1 ప్రభుత్వ భూమిలో అక్రమంగా ప్లాట్లు చేసి విక్రయించిన దేవిడి మాలతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మండల తహసీల్దార్‌కు గురువారం వినతి పత్రం సమర్పించారు. లేట్ దేవిడి అశిరెడ్డి, లేట్ దేవిడి సత్తిరెడ్డి, లేట్ దేవిడి అనసూయమ్మ, దేవిడి వెంకట్‌రెడ్డి, లేట్ దేవిడి చంద్రారెడ్డి, లేట్ దేవిడి పెంటారెడ్డి, మరికొంత మంది కలిసి దేవిడి మాలతి భర్త సురేందర్‌రెడ్డికి సేల్‌డీడ్ చేశారని తెలిపారు. కాగా సర్వేనం 127/1లో సర్వేనం 127/3 పేరుతో ప్లాట్లు చేసి పంచుకొని విక్రయించిన దేవిడి మాలతి భర్త సురేందర్‌రెడ్డి అంబేద్కర్ చౌరస్తా నుంచి తట్టిఅన్నారం మొయిన్ రోడ్‌లో ప్లాట్‌నం 31 విస్తీర్ణం 817 గజాలు, ప్లాట్‌నం 40,41 విస్తీర్ణం 596 గజాలు, సర్వేనం 127/3 నిషేధిత జాబితలో ఉన్నందున నోటరీ పద్ధతిలో విక్రయించారని పేర్కొన్నారు. 3 ప్లాట్ల విస్తీర్ణం 1413 గజాలు భూమి ఉందని, అట్టి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రజా అవసరాల కోసం ఉపయోగించాలని గ్రామస్తులు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

తండ్రిని చంపిన వ్యక్తికి జీవిత ఖైదీ

షాబాద్, ఫిబ్రవరి 13: తండ్రిని చంపిన కొడుకుకి జీవిత ఖైదీ పడింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దామర్లపల్లి గ్రామానికి చెందిన బోకుల వెంకటేష్ 2022 సంవత్సరంలో మద్యం తాగి తన తండ్రిని హత్య చేశాడు. అప్పట్లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం ఎల్బీనగర్ కోర్టులో నేరం రుజువుకావడంతో నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో

ట్యాబ్ అపహరణ

మొయినాబాద్, ఫిబ్రవరి13: ప్రభుత్వ పాఠశాలకు సర్కార్ ఇచ్చిన ట్యాబ్ అపహరణకు గురైంది. ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మండల పరిధిలోని ఎల్కగూడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా మహేశ్వరి పని చేస్తున్నారు. అయితే ఆమె రెండు రోజుల పాటు సెలవులో ఉండగా, పాఠశాల బాధ్యతలు ఉపాధ్యాయుడు ప్రవీణ్ చేపట్టారు. స్కావెంజర్ వద్ద ఉన్న తాళాలు సోమవారం పోయాయి. కాగా మంగళవారం పాఠశాల ముగిసిన తరువాత ఉపాధ్యాయుడు ప్రవీణ్ తన వద్ద తాళాలతో పాఠశాలలోని బీరువాలో ట్యాబ్ పెట్టి తాళం వేసి వెళ్లాడు. బుధవారం ఉదయం ఉపాధ్యాకుడు వచ్చే సరికి పాఠశాల తలుపులు తెరిచి ఉండటంతో తాళాలు దొరికాయా అని ఉపాధ్యాయుడు ప్రవీణ్ స్కావెంజర్‌ను అడిగాడు. తాళాలు ఏమి దొరకలేదని చెప్పడంతో ఉపాధ్యాయుడికి అనుమానం వచ్చి బీరువాను చూడగా, ట్యాబ్ కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని దుండగులు ట్యాబ్ అపహరించినట్లు గుర్తించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గిరిజనుల సంస్కృతిని కాపాడాలి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మంచాల, ఫిబ్రవరి 13: గిరిజనుల సంస్కృతీసాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 330 మంది గిరిజన విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతుండడంతో కస్తూర్బా పాఠశాలను ట్రైబల్ ఫెస్ట్‌వల్‌గా ఎంపిక చేశారు. అందులో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గిరిజనుల విద్యార్థుల సాంస్కృతిక సమ్మేళనం ట్రైబల్ ఫెస్ట్‌వల్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గిరిజన విద్యార్థులు లంబాడి పాటలపై నృత్యాలు చేసి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కస్తూర్బా పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, జిల్లా విద్యాధికారి సుశీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఏఎమ్‌వో జయచందర్‌రెడ్డి, సీఎంవో కృష్ణయ్య, జీసీడీవో సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలతారెడ్డి, ఎంఈవో రాందాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న గిరిజన విద్యార్థినులు

సంక్షేమ పథకాల అమలుపై నిర్లక్ష్యం తగదు

మంచాల : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం మంచాల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా పలు శాఖలకు చెందిన అధికారులను అభివృద్ధి, ప్రజాసంక్షేమ పథకాలపై వారిని అడగగా వారి నుంచి సరైన సమాధానం చెప్పకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు గ్రామ స్థాయిలో లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను అందే విధంగా చూడాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎంపీడీవో బాలశంకర్, తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కడ్తాల్, ఫిబ్రవరి 13: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధిలోని సాలార్‌పూర్, మక్తమాదారం, న్యామతాపూర్, రావిచేడ్, పాతకోటతండా, పడకల్ గ్రామాల్లో ఎస్సీ సబ్ ప్లాన్, సీఆర్ఆర్, సీడీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, అంగన్‌వాడీ భవనం, ప్రహరీ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం న్యామతాపూర్ గ్రామంలోని చెంచులకు మంజూరైన బోర్ మోటర్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీడీవో రామేశ్వరిదేవి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, సాయిలు, బీచ్యానాయక్ పాల్గొన్నారు.

ముసాయిదాపై రాజకీయ పార్టీలతో సమావేశం

షాబాద్, ఫిబ్రవరి 13: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎంపీటీసీ, జడ్పీటీసీ ముసాయిదా పోలింగ్‌స్టేషన్లకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అపర్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలపై చర్చించినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలకు 88పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో 49,689 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ముసాయిదా తుది జాబితా ఈ నెల 15వ తేదీన ప్రచురించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ శారద, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

షాబాద్ : రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో అపర్ణ

అందని అభ్యంతరాలు

కేశంపేట : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ముసాయిదాపై ఎలాంటి అభ్యంతరాలు అందలేదని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం ఆయా పార్టీల నేతలతో జరిగిన సమావేశంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. మండలంలోని 12ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి 61పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కిష్టయ్య, ఆయా పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో విద్యార్థికి బంగారు పతకం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని సంజయ్‌గాంధీ మెమోరియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి చింతకాయల నరేందర్ రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ క్రీడల్లో టేబుల్ టెన్నీస్ విభాగంలో ప్రతిభచాటి బంగారు పతకాన్ని సాధించాడు. ఫైనల్లో వరంగల్ జిల్లా ప్రత్యర్థిని 3-0 తేడాతో ఓడించి ఘనవిజయం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగమునినాయక్ తెలిపారు. నరేందర్‌ను గురువారం ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఆటో మొబైల్ విభాగం అధిపతి శశిభూషణ్‌గౌడ్, టీమ్ మేనేజర్ శంకర్‌మోకెన, ఫిజికల్ డైరక్టర్ వెంకటరమణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో

సత్తా చాటిన విద్యార్థి

విశాల్

ఆమనగల్లు, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో ఆమనగల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి వడ్త్యావత్ విశాల్ సత్తాచాటాడు. జేఈఈ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌లో ఎన్‌టీఏ స్కోర్ 83.8762939 సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా విశాల్‌ను ప్రిన్సిపాల్ మాధవరావు, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు కృష్ణయ్య, సిబ్బంది, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

షాద్‌నగర్, ఫిబ్రవరి 13: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మీనివాస్ పాల్గొని మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అకాడమిక్ ఇయర్ ముగింపు దగ్గరకు వస్తున్నా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో ప్రభుత్వ మెను సరిగా అమలుకావడంలేదని, ఆహారంలో నాణ్యతలోపించడంతో ఎంతో మంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయనిపక్షంలో టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌వో షాద్‌నగర్ కమిటీ సభ్యుడు సంపత్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ మొక్కలను సంరక్షించాలి

యాచారం, ఫిబ్రవరి13: వేసవిలో నర్సరీలో పెంచుతున్న మొక్కలకు నిత్యం నీరందించి సంరక్షించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. మండలంలోని మొండిగౌరెల్లి, యాచారం, చింతపట్ల గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. మొక్కలు పెంచుతున్న తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాట్సాప్ మెసేజ్‌తో డబ్బులు మాయం

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 13: వాట్సాప్‌కు వచ్చిన మెసేజ్‌కు ఓ వ్యక్తి స్పందించి రూ.80 వేలను పోగొట్టుకున్న ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని పట్నం మహేందర్‌రెడ్డి దవాఖానలో వైద్యుడిగా పని చేస్తున్న పవర్ ఆదిత్య అప్పారావుకు ఈ నెల 10తేదీన వాట్సప్‌లో గుర్తు తెలియని 8266075602 నంబర్ నుంచి మీరు ఈ టెలిగ్రామ్‌లో జాయిన్ అవ్వాలని అని మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు మెసేజ్‌కు స్పందించాడు. మరలా అదే నంబర్ నుంచి మరోసారి మీరు తదుపరి సమాచారం కోసం మా చానల్‌లో జాయిన్ అవ్వాలని మెసేజ్ రావడంతో ఆ మెసేజ్‌ను ఫాలో అయ్యాడు. కొద్ది సేపటికే అతడి అకౌంట్ నుంచి రూ.80వేలు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే అకౌంట్‌ను చూసుకోగా, తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెద్దమంగళారంలో చోరీ

మొయినాబాద్, ఫిబ్రవరి13 : బంధువుల ఇంట్లో పెళ్లి ఉండటంతో ఊరికి వెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్ల చేశారు. ఇంట్లోని బంగారం, నగదును దుండగులు అపహరించారు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన బొలించెరువు కృష్ణారెడ్డి ఇంట్లో బుధవారం రాత్రి దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం శంకర్‌పల్లి మండల పరిధిలోని పొద్దుటూరులో పెళ్లి ఉండటంతో వెళ్లారు. తిరిగి గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళి చూడగా, బీరువా తాళం పగుల గొట్టి 8 తులాల బంగారం, రూ. లక్ష నగదును అపహరించారు. కుటుంబ సబ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

మొయినాబాద్, ఫిబ్రవరి13: అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న పైడి రాకేశ్‌రెడ్డి గురువారం ఆలయానికి వచ్చి అర్చకుడిని పరామర్శించాడు. అర్చకుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అర్చకుడిపై దాడి సరికాదు

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని తెలుసుకుని గురువారం గౌడకుల హక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ పరామర్శించి దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సమితి జిల్లా అధ్యక్షుడు సిద్దాంతి నర్సింహగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కె మల్లేశ్‌గౌడ్, నాయకులు సుభాశ్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, సురేశ్‌గౌ